క్లుప్తంగా

విజయవంతంగా సదరమ్ క్యాంపు..



దివ్యాంగులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరాలోని ఎస్వీఎస్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన సదరమ్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంపును ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ సదరమ్ క్యాంపును సందర్శించి దివ్యాంగులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, వైరా ఏసీపీ రహమాన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామంలో దావ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో టీఎస్ఆర్టీసీ ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సర్పంచ్ నారపోగు కొండల్‌రావు 20 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు రవీందర్ నాద్, బుజంగ్‌రావు, పుల్లయ్య పాల్గొన్నారు.

మద్దతు ధర చెల్లించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు శివవేణు, సాల్మన్‌రాజు

సత్తుపల్లి: ప్రభుత్వం రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు కొత్రపాటి సాల్మన్‌రాజు, శివవేణు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యన్ని సకాలంలో కొనకుండా కాలయాపన చేయడంతో ధాన్యం తడిసిందన్నారు. రెండు రోజులుగా రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అప్పారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు..

తల్లాడ: తల్లాడలోని గోడౌన్ వద్ద తడిసిన ధాన్యాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు శేఖర్ గౌడ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎర్రి కృష్ణారావులు ధాన్యం గోడౌన్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, రాఘవ, నరసింహారావు, కృష్ణయ్య, మదుసూదన్‌రావు, అచ్చయ్య పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మధిర: మండలంలోని నిధానపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో మాటూరుపేట ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యాధికారి పాతూరి శ్రీనివాసరావు పాల్గొని బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి తగిన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీహరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాములు

కారేపల్లి: మండలంలోని గుంపెళ్లగూడెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ గుగులోత్ రాములు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూక్యా అమ్రిలాలు, వైద్యాధికారి హిమబిందు, సూపర్వైజరు విజయ, ఎఎన్ఎంలు పుష్ప, నాగమణి, వర్కర్లు బుచ్చమ్మ, సైద, లలిత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోస్తలేవ్ !



పెగళ్లపాడు ఎత్తిపోతల పథకం

పనిచేయని 'పెగళ్లపాడు లిఫ్ట్'

- పదేళ్లుగా నిలిచిన మరమ్మతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

ఎర్రుపాలెం: బీడు భూములు సాగులోకి తీసుకొచ్చేందుకు నిర్మించిన ఎత్తిపోతల పథకాలు పనిచేయడం లేదు. మండలంలోని పెగళ్లపాడు గ్రామంలో కట్లేరుపై సన్న, చిన్నకారు రైతుల భూములకు సాగునీరు పంపిణీ కోసం నిర్మించిన ఎత్తిపోతల పథకం నిర్మాణ లక్ష్యం నెరవేరడం లేదు. ఏళ్లతరబడి లిఫ్ట్ పనిచేయడం లేదు. రోజూ రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న పాలక ప్రభుత్వం, అధికారులు ఈ ఎత్తిపోతల పథకాన్ని మాత్రం గాడిలో పెట్టడాన్ని విస్మరించారు.

వినియోగంలోకి తీసుకురావాలి..

పెగళ్ళపాడు, ఎర్రుపాలెం, జయంతి గ్రామాలకు చెందిన 105 మంది రైతులు 175 ఎకరాల మేరకు వరి మాగాణి, మెట్ట పంటలను ఈ లిఫ్ట్ కింద సాగు చేస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులకు చెందిన భూముల మేరకు ఆయకట్టు ఉంది.



పని చేయని విద్యుత్ మోటర్లు

పదేళ్లకు పైగా అందని సాగుకు అందని నీరు..

ఆ భూములకు సాగునీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాన్ని 2009 సంవత్సరంలో రూ.50 లక్షలు నిధులు వెచ్చించి నిర్మించింది. అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎల్పీ లీడర్ మల్లు భట్టి విక్రమార్క ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. పథకం ప్రారంభించన తర్వాత కేవలం రెండు, మూడేళ్లు మాత్రమే సాగునీరు ఎత్తిపోసింది. దాదాపు పదేళ్లకు పైగా చుక్క నీరు కూడా పంట పొలాలకు రావడం లేదు. దీంతో రైతాంగం సాగు చేస్తున్న పంటలకు నీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తాం..

ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం రైతులకు అవగాహన కల్పింస్తాం. పెగ్గళపాడు లిఫ్ట్ పనిచేయని మాట వాస్తవమే.. ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులతో కలసి లిఫ్ట్‌ను పరిశీలించడం జరిగింది. దీని పథకాల రిపేర్ కోసం అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తాం. నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతాం.

– సాంబశివరావు, ఇరిగేషన్ డీఈ, ఎర్రుపాలెం

ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది..



కట్లేరులో నీరు పుష్కలంగా ఉంది. ఇక్కడ నుంచి సాగు నీటిని ఎత్తిపోసేందుకు గానూ ఐడీసీ నిర్మించింది. దశాబ్దం క్రితం నిర్మించిన ఈ పథకం పనితీరు పట్ల పాలకులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఈ లిఫ్ట్ కింద సాగు చేసేది అందరూ ఎస్సీ రైతులే. సాగు భూములకు చుక్క నీరు కూడా రాకపోవడంతో వర్షం నీటిపైనే ఆధారపడాల్సి వస్తుంది.

– సగ్గుర్తి రాజేశ్వరి, సర్పంచ్, పెగళ్లపాడు

వినియోగంలోకి తేవాలి..



ఎత్తిపోతల పథకం ఆయకట్టు కింద నాకు ఎకరం భూమి ఉంది. సాగునీరు అందక పంట చేతికొచ్చే సమయానికి పంట ఎండిపోతుంది. పలుమార్లు పాలకులకు, అధికారులకు వినతిపత్రాలు అందచేసినప్పటికీ ఫలితం శూన్యం. రైతులపై అధికారులకు, ప్రభుత్వానికి పట్టింపు లేదు. ఇప్పటికైనా త్వరగా వినియోగంలోకి తీసుకురావాలి.

– సగ్గుర్తి సంజీవరావు, ఆయకట్టు రైతు, పెగళ్లపాడు

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్తున్న వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, తదితరులు

ఏన్కూరు: దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ తెలిపారు. మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం చైర్మన్ భూక్యచందులాల్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏన్కూరు ప్రధాన సెంటర్ నుంచి గార్లఒడ్డు దేవాలయం వరకు ద్విచక్రవాహనాలపై ర్యాలీ నిర్వహించారు. గార్లఒడ్డు దేవాలయంలో పూజలు చేసి చైర్మన్ భూక్య చందులాల్, ఆలయ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, భూక్య లాలు, బానోత్ సురేష్ నాయక్, మేడ ధర్మారావు, సర్పంచ్‌లు భూక్యకాంతి, భూక్య బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో ఆందోళన



కొణిజర్ల: మొక్కజొన్న రాశులపై చేరిన వర్షపు నీరు



తల్లాడ: అంజనాపురంలో ధాన్యంపై పట్టాలు కప్పిన దృశ్యం

కొణిజర్ల/తల్లాడ: కొణిజర్ల, తల్లాడ మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడ్డారు. కొణిజర్ల, తల్లాడతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం, మొక్కజొన్న కల్లాల్లో పట్టాలు కప్పినప్పటికీ పట్టాల కిందకు నీరు చేరింది. రాత్రి కూడా వర్షం కురిస్తే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మే నెల మొదటి వారంలో మునుపెన్నడూ లేని విధంగా వర్షాలు పడుతుండటం రైతులకు శాపంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



మధిరలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు



కొణిజర్ల: కళ్లకు గంతలతో జేపీఎస్‌ల నిరసన



పెనుబల్లి: మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

మధిర/ సత్తుపల్లిరూరల్/ కొణిజర్ల/ ఏన్కూరు/ వైరారూరల్/ఎర్రుపాలెం/పెనుబల్లి: తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. మధిరలో చేపట్టిన దీక్షకు పీఆర్టీయూ జిల్లా బాధ్యులు ఆర్.రంగారావు, ఆర్.బ్రహ్మరెడ్డి, సత్తుపల్లిలో తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడు మేల్లెల్లి శ్రీనివాస్‌లు సంఘీభావం తెలిపారు. కొణిజర్లలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపి ఫోన్లో మాట్లాడారు. జేపీఎస్‌లు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. ఏన్కూరులోని జేపీఎస్‌లు చేపట్టిన దీక్షకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వైరా నియోజకవర్గ అభ్యర్థి బానోత్ విజయభాయి, వైరాలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎర్రుపాలెంలో పొంగులేటి వర్గీయులు డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ కవిత, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిలు, పెనుబల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె న్యాయమైందని, తక్షణమే ప్రభుత్వం స్పందించాలని కోరారు. గత మూడు నెలల నుంచి పంచాయతీ కార్యదర్శులకు జీతాలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో యూనియన్ నాయకులు సీహెచ్ వి.రవికుమార్, ఎస్‌కే.మదార్, జి.కిరణ్ కుమార్, టి.కృష్ణారెడ్డి, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, ఎండీ.జమీర్, కృష్ణయ్య, రామారావు, నాగేశ్వరరావు, తంతి తపాలా యూనియన్ నాయకుడు రామారావు, టీపీపీఎఫ్ సత్తుపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు మురళీ, కె.గోపాలరావు, యేసుబాబు, అంజయ్య, ఉద్దండు, రవి, ఎస్‌కే.జాని, సీపీఐ నాయకుడు యర్రా బాబు, ముక్తి వెంకటేశ్వర్లు, గిద్దగిరి సత్యనారాయణ, స్వర్ణ ప్రహ్లాదరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, నల్లమల శివ కుమార్, కృష్ణార్జున రాజు, నాయకులు గూడూరు నరసింహారెడ్డి, బుర్రా వెంకటనారాయణ, తక్కెళ్లపాటి వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదుగుల చిన్ని కృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బానోత్ రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మహేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నాయుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్జికి సత్కారం



జూనియర్ సివిల్ జడ్జి శ్రావణస్వాతిని సత్కరిస్తున్న బార్ అసోసియేషన్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న చింతాడ శ్రావణస్వాతి హన్మకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి సత్తుపల్లి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆయేషాసరీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, ఏపీపీలు భాషా, ప్రదీప్, మహేంద్రనాద్, న్యాయవాదులు మందపాటి రాజేంద్రప్రసాద్, రాచూరి సీతారామయ్య, బొర్రా వెంకట్రావ్, కూకలకుంట రవి, వంకదారు రామకృష్ణ, కొండపల్లి విజయ్‌కుమార్, పిన్నం జానికీరామయ్య, మృణాళిని, ప్రసాద్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుమ్మా నరేష్‌కు సేవా పురస్కారం



నరేష్‌ను సన్మానిస్తున్న సినీ ప్రముఖులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంకు దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేష్‌ను దాసరి సేవా పురస్కారం లభించింది. దివంగత సినీ దర్శకుడు దాసరి నారాయణరావు పేరిట ఈ పురస్కారాన్ని హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనకు అందజేసి సన్మానించారు. సినీ నటులు, దర్శకులు వీ.వీ.వినాయక్, సి.కళ్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ్, ముత్యాల సుబ్బయ్య, కృష్ణ వంశీ, బ్రహ్మానందం, ఆలీ, శ్రీకాంత్, రేలంగి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయండి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ కోరారు. మండలంలో చేయూత మోటార్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణం ప్రధాన నగరాలకు ఎటువైపు చూసినా 100 కిలోమీటర్ల మధ్యలో ఉందని.. లారీలు, ఆటోలు, ఇతర వాహనాల మెకానిక్‌లందరు కలిసి ఒకేచోట పని చేసుకోనే విధంగా ఆటో నగర్ ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, యూనియన్ అధ్యక్షుడు నజీముద్దీన్, తడికమళ్ల యోబు, మహ్మద్ అలీ, ఏడుకొండలు, కర్నాటి రవి, గణేష్ పాల్గొన్నారు.

నిరుపేదలకు 'కల్యాణలక్ష్మి' వరం



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం: నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరమని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. మంగళవారం మండలంలోని రైతువేదికలో 65 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ దేవరకొండ శిరీష, తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీఓ శ్రీనివాసరావులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం ఇటీవల తెల్లపాలెం గ్రామ సర్పంచ్ రామకృష్ణ తండ్రి మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు అప్పారావు, భాస్కరరెడ్డి, పురుషోత్తంరాజు, పుల్లారెడ్డి, ఎంపీటీసీలు మల్లిఖార్జున్ రెడ్డి, మస్తాన్‌వలీ, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల హర్షం

సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు అభిషేకం



మధిర : కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కార్మికులు



సత్తుపల్లిటౌన్: సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు కొబ్బరినీళ్లతో అభిషేకం చేస్తున్న కార్మికులు

మధిర/ సత్తుపల్లిటౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల వేతనాన్ని రూ.వెయ్యి చొప్పున పెంచడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ ఆధ్వర్యాన మంగళవారం స్థానిక రింగ్ సెంటర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చిత్రపటాలకు పూలు, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి రింగ్‌సెంటర్ వరకు సీఎం కేసీఆర్ చిత్రపటాలతో ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్.కే.రఫీతో పాటు ఎస్.కే.చాంద్‌పాషా, అద్దంకి అనిల్, మాధురి మధు, వేములపల్లి మధు, అమరవరపు కృష్ణారావు, చల్లగుండ్ల కృష్ణయ్య, నడ్డి ఆనందరావు, మేకల నర్సింహారావు, తడికమళ్ల ప్రకాశరావు, ఎండీ.గఫార్‌ఖాన్, గుండ్ర రాఘవేందర్, మదీనాపాషా పాల్గొన్నారు. ఇక మధిర మున్సిపల్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు మొండితోక లత, శీలం విద్యాలత మాట్లాడుతూ వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో కార్మికులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండితోక నాగరాణి, గద్దల మాధురి, మునుగోటి వెంకటేశ్వరరావు, ధరావత్ మాధవి, మేడికొండ కళ్యాణి, సయ్యద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు



సత్తుపల్లిరూరల్: తహసీల్ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: దళితబంధు పథకంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేల అవినీతిని వ్యతిరేకిస్తూ ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సత్తుపల్లి తహసీల్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా కో–ఆర్డినేటర్ ఏపూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా తనవద్ద ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన ఎమ్మెల్యేను బహిరంగ పర్చాలని డిమాండ్ చేశారు. ఆ ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ముత్తారావు, గాంధీ, శ్రీనివాసరావు, రవి, బాబురావు, రమేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి..

పెనుబల్లి: దళితబంధులో అక్రమాలకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నరసింహారావు అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదుగుల చిన్ని కృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బానోత్ రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మహేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు నాయుడు గోవర్ధన్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు

కారేపల్లి: విద్యుత్ ప్రసారం, పరికరాలు, గృహోపకరణాల వాడకంపై అవగాహనతో ప్రమాదాలు నివారించవచ్చని కొత్తలింగాల ఏడీ కేవీ ఆనందకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చీమలపాడు, కారేపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ భద్రత, పొదుపుపై వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు అధికంగా వర్షాకాలంలో నమోదవుతున్నాయన్నారు. గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగటం జరుగుతుందని, వాటిని చూడక ముట్టుకోవటం ద్వారా ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. బట్టలు ఆరేసేందుకు ఇనుప తీగలను దండెములుగా వాడుతున్నారని, అవి విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతాయన్నారు. అనంతరం ప్రమాదాలు నివారించేందుకు ముద్రించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మాలోత్ కిషోర్, స్రవంతి, ఏఈలు కె.రామకృష్ణ, విజయ్‌కుమార్, ఫోర్‌మెన్ లక్ష్మీనారాయణ, లైన్‌మెన్ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న సత్తుపల్లి ఏసీపీ రామానుజమ్

ఏన్కూరు: ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలను పరిరక్షించాలని సత్తుపల్లి ఏసీపీ రామానుజమ్ అన్నారు. మంగళవారం మండలంలోని భద్రుతండాలో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ కోసం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు తమ సమస్యలపై 100కు డయల్ చేయాలన్నారు. ముఖ్యంగా రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపొవద్దని, అలాంటి వారి వివరాలను పోలీసులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బాదావత్ రవి, కానిస్టేబుల్స్ వెంకట్, రవి పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా ?



లాలాపురం వద్ద ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

కొణిజర్ల: మండలంలోని లాలాపురం సమీపంలో రాష్ట్రీయ రహదారి ప్రమాదకంరగా ఉంది. రోడ్డు మధ్యలో భారీ గుంతల ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురౌతున్నారు. పల్లిపాడు, ఏన్కూరు రహదారి 5 ఏళ్ల క్రితం నిర్మించారు. ఏడాదికే రోడ్డు ధ్వంసం అవ్వడంతో పలుమార్లు మరమ్మతులు చేశారు. లాలాపురం జమ్మికోయ బంజర గ్రామాల మధ్య జామ తోట వద్ద రోడ్డుపై భారీ గోయ్యి పడటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల, మంగళవారం కారులో వెళ్లున్న వారు ఈ గుంతలను తప్పించే క్రమంలో కింద పడి ప్రమాదాలకు గురైయ్యారు. రోడ్డు మరమ్మతుల నిమిత్తం అధికారులు గుంటల్లో మడ్ మిక్సర్ పోసి చేతులు దులుపుకుంటున్నారు. ఖమ్మం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నిత్యం వందలాది వాహనాలు తిరిగే ఈ రహదారిపై మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే శాశ్వత రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ అధికారులను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.